క్లుప్తంగా

ఘనంగా బల్లల పండగ



పూజలు చేస్తున్న నవీన్‌కుమార్, తదితరులు

డాబాగార్డెన్స్: రజకుల కుల దైవం బల్లల పండగ సోమవారం ఘనంగా జరిగింది. కనకల వీధి, గంగులగెడ్డలో నిర్వహించిన బల్లల పండగలో వైఎస్సార్‌సీపీ వార్డు నాయకుడు బత్తిన నవీన్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనను వివిధ రజక సంఘాల నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు ఎరబాల అప్పారావు, కనకరాజు, జితేందర్, దొడ్డి త్రిమూర్తులు, మదీనవల్లీ, అర్జి రాజేష్, శంకర్రావు, నక్కా వేణుగోపాల్, రజక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్య దైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్త రోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు. పూర్తి వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని ఆలయ అధికారులు ఓ ప్రకటనలో కోరారు.

బీచ్‌లో ఉచితంగా షుగర్ పరీక్షలు



బీచ్‌లో రక్త పరీక్షలు, బాడీ మాస్ ఇండెక్స్ చెక్ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

అల్లిపురం: లయన్స్ క్లబ్, ఎంవీపీ కాలనీ ప్రతినిధులు బీచ్‌రోడ్డులో రోజూ ఉదయం ఉచితంగా షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. బీచ్‌లో వాకర్లకు, సందర్శకులకు రోజుకి 100 మందికి రక్త పరీక్షలు, బాడీమాస్ ఇండెక్స్ పరిశీలించి ఆరోగ్య సూత్రాలతోపాటు డైట్ అడ్వైజ్ చేస్తున్నట్లు లయన్స్ క్లబ్ ఎంవీపీ కాలనీ అధ్యక్షుడు ఎం.పండు, కార్యదర్శి శ్రీరామమూర్తి, క్లబ్ మెంబర్ జానకి, ప్రకాశ్ తెలిపారు. రోజుకి ఒక ప్రాంతంలో శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా హెల్త్ డ్రింక్ ప్యాకెట్లు అందజేస్తున్నామని తెలిపారు.

రోడ్డుకు అడ్డంగా వాహనాల నిలిపివేత



రోడ్డుపై కారు నిలిపివేయడంతో డ్రైవర్‌తో మాట్లాడుతున్న పోలీస్

సీతమ్మధార : జీవీఎంసీ ప్రధాన కార్యాలయం మెయిన్ గేటు పక్కన కారు నిలిపివేయడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం గేటు పక్కన ఓ కారు నిలిపివేసి డ్రైవర్ నిద్రపోవడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంది. దీంతో అటువైపు వెళ్తున్న ట్రాఫిక్ టోకింగ్ వ్యాన్‌లో ఉన్న కానిస్టేబుల్ డ్రైవర్‌ను నిద్ర లేపి కారు పక్కన పెట్టించారు. దీంతో ట్రాఫిక్ సమస్యకు తెరపడింది. అయితే ఈ ప్రాంతంలో కార్లు, వ్యానులు రోడ్డుకు అడ్డంగా నిలిపివేసి డ్రైవర్లు బయటకు వెళ్లిపోవడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వైఎస్సార్ బీమాతో పేదలకు భరోసా



దుంగ లక్ష్మికి చెక్కు అందజేస్తున్న కార్పొరేటర్ తోట పద్మావతి తదితరులు

అల్లిపురం : పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ బీమాను పక్కాగా అమలు చేస్తోందని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం సొంతంగా వైఎస్సార్ బీమా పథకాన్ని తీసుకొచ్చి బాధిత కుటుంబాలకు అండగా నిలిచిందన్నారు. పెద్ద దిక్కు కోల్పోయి శోకసంద్రంలో మునిగిన కుటుంబీకులకు నేనున్నా అంటూ సీఎం జగన్ భరోసా కల్పిస్తున్నారన్నారు. 34వ వార్డు పరిధి కొబ్బరితోట – 1 సచివాలయం పరిధిలో ఇటీవల మరణించిన దుంగ వెంకటరమణ భార్య దుంగ లక్ష్మికి, బండి చిట్టిబాబు భార్య బండి లక్ష్మికి వైఎస్సార్ బీమా చెక్కులను సోమవారం ఆమె అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు అమలుచేసే క్రమంలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా రాష్ట్ర ప్రభుత్వం వెనక్కు తగ్గడం లేదన్నారు. వైఎస్సార్ బీమా పథకం అమలు కోసం గతంలో కేంద్ర ప్రభుత్వం వాటాగా 60 శాతం నిధులు ఇస్తే, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు అందించేదన్నారు. 2020 ఏప్రిల్ నుంచి కేంద్ర ప్రభుత్వం పథకం నుంచి తప్పుకోవడంతో ఆర్థిక భారం మొత్తం రాష్ట్ర ప్రభుత్వంపై పడిందన్నారు. ఇదే సమయంలో బీమా కంపెనీలు ప్రీమియం మీద 35 శాతం పెంచాయన్నారు. పథకం అమలులో కేంద్రం తప్పుకున్నా, బీమా కంపెనీలు ప్రీమియం పెంచినా, కరోనా కారణంగా రాష్ట్రం ఇబ్బందుల్లో ఉన్నా పేదలకు అండగా నిలవాలన్న జగనన్న సంకల్పం ఏమాత్రం చెక్కుచెదరలేదన్నారు. వైఎస్సార్ బీమా పథకం తీసుకొచ్చి అమలు బాధ్యత మొత్తాన్ని తన భుజాన వేసుకున్నారని కొనియాడారు. సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ రొంగలి వెంకటరమణ, వలంటీర్లు పల్లవి, కె.మణికంఠ, అనిల్, పార్టీ నాయకులు దూడ అప్పారావు, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

గోల్డెన్ అవర్స్‌లో సాయమందించండి

- కేజీహెచ్ ఆర్థో సర్జన్ డాక్టర్ రాజ్ కమల్



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ రాజ్ కమల్

గోపాలపట్నం: రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులను గోల్డెన్ అవర్‌లో ఆస్పత్రికి తరలించేందుకు సహకరించాలని కేజీహెచ్ ఎముకల వైద్యనిపుణుడు డాక్టర్ వి. రాజ్ కమల్ కోరారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం రవాణా శాఖ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ రహదారి భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలు జరగవన్నారు. రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రికి తరలిస్తే ప్రాణాలు కాపాడవచ్చని వివరించారు. అలా స్పందించిన వారు ప్రాణదాతలుగా నిలుస్తారన్నారు. గుడ్ సమారిటన్ గైడ్‌లైన్స్‌ను అందరూ పాటించాలని కోరారు. ఆర్టీవో ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వాహన చోదకులు భద్రతా నిబంధనలు పాటించాలన్నారు. అధిక వేగంతో వాహనాలు నడపడం వల్ల జరిగిన 10 ప్రమాదాల్లో 7 మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలన్నారు. పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్టీవో వేణుగోపాల్, సహాయ మోటార్ వాహన తనిఖీ దారులు శ్రీనివాస యాదవ్, ఏవో కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించిన చిలకపేట - 01 సచివాలయం జట్టు



విజేతలతో ఆర్డీవో హుస్సేన్, జెడ్సీ శివప్రసాద్, కార్పొరేటర్ తోట పద్మావతి తదితరులు

అల్లిపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా సంబరాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. వన్‌టౌన్ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో సోమవారం జరిగిన పోటీల్లో 34వ వార్డు కొబ్బరితోట – 2 సచివాలయం పురుషుల క్రికెట్ టీమ్, కబడ్డీ టీమ్ జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించాయి. భూపేష్‌నగర్ సచివాలయం మహిళల కబడ్డీ టీమ్ 3వ స్థానంలో నిలిచింది. విజేతలకు ఆర్డీవో హుస్సేన్, జోన్ – 4 జోనల్ కమిషనర్ శివప్రసాద్, కార్పొరేటర్ తోట పద్మావతి ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు రాములమ్మ, దూడ అప్పారావు, అనిల్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు చిలకపేట జట్టు

డాబాగార్డెన్స్: ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో చిలకపేట – 01 సచివాలయం మహిళలు కబడ్డీ పోటీలో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఫైనల్ పోటీలో భూపేష్‌నగర్ సచివాలయంపై విజయం సాధించారు. రెండో స్థానంలో భూపేష్‌నగర్ నిలవగా, మూడో స్థానంలో ఐఎస్‌బీ నగర్ సచివాలయం జట్టు నిలిచింది. చిలకపేట – 01 సచివాలయం నుంచి మహంతి రాజేశ్వరి, చోడిపిల్లి శ్రావణి, చేపల నందిని, చోడిపిల్లి లక్ష్మి, మేఘన, వి.అరుణ, వాసుపల్లి జ్యోతి, వాసుపల్లి లక్ష్మి, సరోజిని, మేడ అపర్ణ, స్వాతి ఆడారు.

బీఎస్పీ అభ్యర్థిగా కదిరి రాము

డాబాగార్డెన్స్: విశాఖ దక్షిణ నియోజకవర్గం బీఎస్పీ అభ్యర్థిగా కదిరి రామును ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి.పరంజ్యోతి ప్రకటించారు. నియోజకవర్గ పరిధి కోటవీధి మత్స్యకార జాలర్ల భవన్‌లో బహుజన సమాజ్ పార్టీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి మాట్లాడుతూ విశాఖ దక్షిణ నియోజకవర్గంలో దశాబ్దాలుగా సమస్యలు తిష్ట వేశాయని, ఒకసారి బీఎస్పీకి అవకాశం ఇస్తే స్థానిక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని హామీ ఇచ్చారు. కదిరి రామును గెలిపించాలని కోరారు.

క్వీన్ మేరీ స్కూల్‌లో వైద్య శిబిరం నేడు

విశాఖ విద్య: విశాఖ నగరంలోని క్వీన్ మేరీ ప్రభుత్వ హైస్కూల్‌లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎఫ్ఎక్స్‌బీ ఇండియా సురక్ష స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ వై.అశోక్ కుమార్ తెలిపారు. విద్యార్థులకు నిపుణులైన వైద్యులు ఆరోగ్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆకర్షణీయంగా రోడ్లు



పెదవాల్తేర్ కరకచెట్టు పోలమాంబ గుడి నుంచి బీచ్‌కు వెళ్లే రహదారి ఇలా..

డాబాగార్డెన్స్: నగర సుందరీకరణ నేపథ్యంలో జీవీఎంసీ పరిధిలో పలు రోడ్లు కోట్లాది రూపాయలతో ఆధునికీకరిస్తున్నారు. నగరంలో రద్దీ దృష్ట్యా జంక్షన్ల అభివృద్ధితోపాటు రోడ్ల విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. పెదవాల్తేర్ కరకచెట్టు పోలమాంబ గుడి నుంచి పలు ప్రభుత్వ ఆస్పత్రుల మీదుగా బీచ్‌కు వెళ్లే రహదారి పనులు పూర్తయ్యాయి. విద్యుత్ వెలుగుల పనులు కూడా పూర్తి కావడంతో ఈ మార్గం పలువురిని ఆకర్షిస్తోంది.

'స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్రం రహస్య ఒప్పందం'



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్షలో ఐద్వా నాయకులు

సీతమ్మధార : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌ను జిందాల్‌కు కట్టబెట్టేందుకు రహస్య ఒప్పందం చేసుకుందని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి ఆరోపించారు. ఈ మేరకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న నిరాహార దీక్ష 1033వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు ఉన్న విలువైన భూములను కాజేయడం కోసం ప్రధాని మోదీ ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తోందన్నారు. బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడం లేదని ప్రకటనలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని చెప్పారు. దేశంలో ఏ స్టీల్‌ప్లాంట్‌కు లేని ఆస్తులు, వనరులు విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఉన్నాయని, వాటిని కారు చౌకగా కొట్టేందుకు మోడీ ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఐకమత్యంతో రక్షించుకుందామన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బొట్టా ఈశ్వరమ్మ, కె.సంతోషం, కె.కుమారి, బి.భారతి, కె.సుజాత, ఎం.వేణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పేదరికం నిర్మూలనకు ధన్ ఫౌండేషన్ కృషి



నీరే ఆధారం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

డాబాగార్డెన్స్: ధన్ ఫౌండేషన్ 25వ వార్షికోత్సవాన్ని సోమవారం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ వైజాగ్ సింపోజియంను బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజెడ్ఎం జ్యోతీశ్వరరావు, ఫిషరీస్ జేడీ షేక్‌లా మహ్మద్‌తో పాటు ధన్ ఫౌండేషన్ ప్రోగ్రాం లీడర్లు గురునాథ్, జానకీరామ్, మదన్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధన్ ఫౌండేషన్ 25 ఏళ్లుగా పేదరిక నిర్మూలనకు కృషి చేస్తోందన్నారు. ఇప్పటికి 33 వేల మందిని భాగస్వాములను చేశామన్నారు. ఆరోగ్య కార్యక్రమాల్లో భాగంగా మల్కాపురం సుహం సమైక్య ఆస్పత్రిని ప్రారంభించామన్నారు. నీరే ఆధారం పుస్తకాన్ని ఆవిష్కరించారు. సైంటిస్ట్ ఇందిరా మాట్లాడుతూ తీర ప్రాంత ప్రజలకు శిక్షణ కార్యక్రమాలు, మహిళలకు సాధికారత, చదువు అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇసుకతోట మేనేజర్ ఉదయ్‌భాస్కరరావు, ఆడిటర్ చలపతిరావు, శ్రీనివాసరావు, గాయత్రి, వి.భాస్కర్, సుహం సిబ్బంది లోకమాత, పలువురు వైద్యులు, సమైక్య సభ్యులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ఏజీఎం సురేష్

విశాఖ విద్య: ఇండియన్ అసోసియేట్స్ ఫిజిక్స్ టీచర్స్ వారు నిర్వహించిన జూనియర్ ఒలింపియాడ్‌లో విశాఖపట్నం శ్రీచైతన్య విద్యార్థులు ప్రతిభ చాటారు. వైజాగ్ జోన్ నుంచి 29 మంది ఎంపికైనట్లు సంస్థ ఏజీఎం ఎంవీ.సురేష్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను వారు ప్రత్యేకంగా అభినందించారు. ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య మరోమారు సత్తా చాటుకుందని అకడమిక్ డైరెక్టర్ సీమ తెలిపారు.

9 నుంచి ఓపెన్ కరాటే పోటీలు



కరాటే చాంపియన్‌షిప్ ట్రోఫీలను ఆవిష్కరిస్తున్న సినీ నటుడు సుమన్ తదితరులు

సీతమ్మధార: నిజి శాటోఖాన్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా, నాయుడు సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9, 10, 11 తేదీల్లో జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు నాయుడు సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ అధినేత నాయుడు తెలిపారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని సింధూర ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలోని విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌లో ఈ పోటీలు జరుగుతాయన్నారు.

కరాటే హబ్‌గా విశాఖ..

ఎస్ఎస్ఎస్‌కేఏఐ చైర్మన్, సినీ నటుడు సుమన్ మాట్లాడుతూ కరాటే ద్వారానే తాను సినీ రంగానికి వచ్చానని చెప్పారు. అయోధ్యలో శ్రీరామదాసు చిత్రంలోని తన సన్నివేశాలను ప్రదర్శించడం చాలా సంతోషంగా ఉందన్నారు. విశాఖ కరాటే హబ్‌గా ఉండడం హర్షణీయమని, కరాటే మాస్టార్లు ఎన్నో కష్టాలు ఎదుర్కొంటూ కరాటే అభివృద్ధికి కృషి చేస్తున్నారని ప్రశంసించారు. క్రీడాకారులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, వాటి వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించాలని సూచించారు. బాలికలకు మార్షల్ ఆర్ట్స్ ఎంతో అవసరమన్నారు. సీఐ అప్పలనాయుడు మాట్లాడుతూ విద్యార్థుల ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందన్నారు. అనంతరం చాంపియన్‌షిప్ ట్రోఫీలు, పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పోటీ కార్యనిర్వాహక చైర్మన్ దాడి రత్నాకర్, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, సింహాచలం దేవస్థానం ధర్మకర్త గంట్ల శ్రీనుబాబు, ఎస్‌జీ గ్రూప్ అధినేత కె.శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతి మహోన్నతమైనది



సోమయాజులను సత్కరిస్తున్న బీవీపీ విశాఖ శాఖ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: గిరిజన సంస్కృతి మహోన్నతమైనదని అఖిల భారత వనవాసి కల్యాణ ఆశ్రమం మార్గదర్శక్ పీవీ సోమయాజులు తెలిపారు. డాబాగార్డెన్స్‌లోని భారత్ వికాస్ పరిషత్ విశాఖ శాఖను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత్‌లోని గిరిజన ప్రాంతాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ముఖ్యంగా గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, ప్రకృతి రమణీయతను పరిశీలిస్తే ఎంతో ఆనందం కలుగుతుందన్నారు. అనంతరం సోమయాజులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ విశాఖ శాఖ అధ్యక్షుడు పంపాన వెంకటేశ్వరరావు, కోశాధికారి మాణిక్యాలరావు, ప్రతినిధులు రమేష్ చంద్‌జైన్, సత్యనారాయణ, ఎంవీ రాజశేఖర్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

తాటిచెట్లపాలెం: కంచరపాలెం బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని ఒక వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతున్నట్లు ఈ నెల 27న రైల్వే భద్రతా దళం సిబ్బందికి సమాచారం అందింది. వెంటనే ఈ వ్యక్తిని అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మరణించాడు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి వయసు సుమారు 35 ఏళ్లు ఉండవచ్చని, సుమారు 5.5 అడుగుల ఎత్తు, చామనఛాయ కలిగి ఉన్నాడని, ఇతడి వద్ద ఏ విధమైన ఆధారాలు లేవని జీఆర్పీ సిబ్బంది తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లోని జీఆర్పి సిబ్బందికి స్వయంగా గానీ 96661 22722, 94406 27547 నంబర్లలో గానీ తెలియజేయాలని జీఆర్పీ ఎస్ఐ వి.బాలాజీరావు కోరారు.

హాకర్ జోన్ కోసం ధర్నా



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న తోపుడు బళ్ల కార్మికులు

సీతమ్మధార : మద్దిలపాలెంలో ఉన్న తోపుడు బళ్ల కార్మికులకు హాకర్ జోన్ ఏర్పాటు చేయాలని సీఐటీయూ మద్దిలపాలెం జోన్ కమిటీ కార్యదర్శి పి.వెంకటరావు కోరారు. ఈ మేరకు సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాకర్ జోన్‌గా ప్రకటించి, బోర్డు ఏర్పాటు చేసి 8 ఏళ్లు అవుతుందన్నారు. ఈ జోన్‌లో 32 మంది కార్మికులకు షెల్టర్ ఏర్పాటు చేసి కరెంట్, మంచినీరు, బాత్రూమ్స్ సదుపాయం కల్పించాలన్నారు. ద్వారకానగర్-4, 5 లైన్‌లో ఉన్న తోపుడు బళ్ల కార్మికులకు రక్షణ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి ఎ.సింహాచలం, ఎ.అప్పారావు, కోలా శ్రీను, నారాయణరావు, చిన్నా గణేష్, రాజీ, రాము, తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి

మహారాణిపేట: పింఛన్‌దారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ కె.ఈశ్వరరావు కోరారు. జిల్లా పరిషత్ కార్యాలయం సమీపంలో ఉన్న జిల్లా పింఛన్‌దార్ల సంఘం ఆవరణలో సోమవారం ఉదయం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఏపీ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పింఛన్‌దారులకు హెల్త్ కార్డు ద్వారా అన్ని వ్యాధులకు చికిత్స అందించాలన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కృష్ణమూర్తి మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో పింఛన్‌దారుల సంఘం నాయకులు జె.సత్యారావు, ఎ.సాయిబాబా, డీఎస్ఎన్ మూర్తి, టి.గోపాలకృష్ణ, ఎం.అప్పలనాయుడు, టి.వి.రమణమూర్తి, ఎల్.విశ్వేశ్వరరావు, జి.సత్యనారాయణ, బి.భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి సాయం

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం వడిచర్ల వీధిలో నివాసం ఉంటున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఎం.కృష్ణవేణి భర్త ప్రకాశరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈ మేరకు వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ కేజీహెచ్ సిబ్బందితో మాట్లాడి పోస్టుమార్టం త్వరగా పూర్తి చేయించారు. సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్.. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5 వేలు సాయం అందజేశారు.

మహిళ ఆత్మహత్య

కూర్మన్నపాలెం: భర్త, అత్తమామల వేధింపులు తాళలేక మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ మేరకు దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం కూర్మన్నపాలెం లోని అంబేడ్కర్‌కాలనీ రామకృష్ణ ఇంగ్లిష్ మీడియం స్కూల్ పక్కన పార్వతీపురానికి చెందిన సైలాడ పాండురంగారావు.. తన భార్య ప్రమీల (31), ఇద్దరు పిల్లలతో నివాసముంటున్నాడు. వీరికి 2012లో వివాహం కాగా, 11 ఏళ్ల బాబు నితీష్‌కుమార్, 4 ఏళ్ల పాప నిహారిక ఉన్నారు. ఆదివారం అర్ధరాత్రి 1.30 గంటలకు పాండురంగారావు మావయ్య పువ్వల శంకరరావుకు ఫోన్ చేసి ప్రమీల ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపాడు. దీంతో పార్వతీపురం నుంచి శంకరరావు దంపతులు కేజీహెచ్‌కు చేరుకుని బోరున విలపించారు. తమ కూతురు ఆత్మహత్య చేసుకోవడంపై అల్లుడు పాండురంగారావు, ఆయన తల్లిదండ్రులే కారణమని దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా భాగస్వామ్యంతోనే 'ఉక్కు' పరిరక్షణ



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

కూర్మన్నపాలెం: ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమవుతుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు చేస్తున్న ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1082వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని కేంద్రప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్రాణ త్యాగంతో ఏర్పాటైన ఉక్కు పరిశ్రమను కాపాడుకోవడం కోసం ఎలాంటి పోరాటాలకైనా సిద్ధమన్నారు. ప్రధాని మోదీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరును మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, ఆదినారాయణ, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

బైక్‌ను లారీ ఢీకొనడంతో యువకుడి మృతి



మృతిచెందిన యువకుడు అప్పలరాజు (ఫైల్)

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గేటు సమీపంలోని సంతోషిమాత గుడి ఎదురుగా సోమవారం బైక్‌ను లారీ ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం దొగ్గవానిపాలెం గ్రామానికి చెందిన దమ్ము అప్పలరాజు(35) ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో రికవరీ ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా ఎస్.కోట బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా అరకు-విశాఖ రోడ్డులో సంతోషిమాత గుడి వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై పడితీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య పార్వతి, హాసిని (12), హసిత్ బాబు పిల్లలున్నారు. ఈ సంఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వి.చంద్రశేఖర్ తెలిపారు.